# అవకాశం!!

రచయిత్రి :

శ్రీమతి పి. మాణిక్యం.



సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ ఆ గదిలో ఈ చివర నుండి అ చివరకు, ఆ చివర నుండి ఈ చివరకు పచార్లు చేస్తున్నాడు రమేష్.

అతని మనసంతా అల్లకల్లోలంగా వుంది.

కారణం?

నిన్నటి సంఘటన పదే-పదే అతని కళ్ళ ముందు కదలాడుతుంది. గట్టిగా కళ్ళు మూసుకొని మరొకసారి దాన్ని గుర్తు చేసుకున్నాడు రమేష్.

ఏదో ఆలోచిస్తూ ఆఫీసునుండి ఇంటికివస్తున్న రమేష్, ఎదుటి దృశ్యం చూసేసరికి అతని పరధ్యానం పటాపంచలయింది.

మెరుపులా వెళ్ళి ముందు వెళుతున్న వ్యక్తిని చటుక్కున తన వైపు లాగాడు. రెప్పపాటులో జరిగిన ఈ పరిణామమునకు ఆ వ్యక్తి క్షణం నివ్వెరపోయి తేరుకుంటూ—

రమేష్‌వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూశాడు. 'చాలా థేంక్సండి. సమయానికి దేవుడిలా వచ్చి ఆ లారీ క్రింద పడకుండా నా ప్రాణం కాపాడారు,' అంటూ చేతులు జోడించాడా వ్యక్తి.

'ఫరవాలేదు లెండి. అయినా కాస్త ఆగి వెళ్ళవచ్చు కదా! ఎందుకంత తొందర? పైగా మీకు...?' అంటూ అతని కాలు వైపు సానుభూతిగా చూశాడు రమేష్.

'ఓ...సారీ! నాకు ఒక కాలు లేదు కదూ? ఆ విషయం నాకు గుర్తే రాదు సుమండీ! నా శ్రీమతి నా కోసం ఎదురు చూస్తూ వుంటుందన్న ఆతృతలో నాకివేవీ గుర్తుండవు. ఆఫీసు పని అవగానే త్వరగా ఇల్లు చేరాలన్నదే నా ధ్యాస. అన్నట్లు నా పేరు మధు. ఈ ప్రక్క వీధిలోనే మాయిల్లు. దయచేసి మాయింటికి వచ్చి 'టీ' తీసుకొని వెళ్ళండి,' అని అభ్యర్థనగా అంటున్న మధు అదృష్టానికి కాస్త జెలసీ కలిగింది అతనిలో.

ఒక్కసారి తన భార్య గుర్తొచ్చింది. డబ్బులోనే సర్వ సౌఖ్యం వుందన్న భ్రమతో ప్రేమించినదాన్ని మోసం చేసి రమ్యను పెళ్ళాడాడు. ఎప్పుడూ తన మాటకు విలువివ్వదు. గొప్పింటి అమ్మాయినని చాలా అహం. తన కోసం ఎదురు

చూడదు సరికదా, ఎప్పుడూ క్లబ్బులు, స్నేహితులు, షికార్లు అని తిరుగుతూ తనని ఎదురాడి మాట్లాడుతుంది.

అతని గుండెల్లోంచి బరువుగా ఒక నిట్టూర్పు వెలువడింది.

'ఇదే మా యిల్లు రండి - రండి,' అంటూ లోపలకు నడిచాడు మధు.

అతనికి కుర్చీ చూపించి 'ఉమా! ఒకసారిలా రావోయ్' అంటూనే వంటింట్లోకి నడిచాడు మధు.

'అబ్బ—ఏమిటండీ హడావిడి? కాఫీ కలిపి తీసుకొస్తాను పదండి.' అందామె.

'ఒకటి కాదు: రెండు తీసుకు రావాలి.'

'అలాగే తీసుకొస్తాను పదండి.'

'ఇంకోటి ఎవరికని అడుగవేం?'

'మీరే చెప్తారని తెలుసు గనుక.'

'ఈరోజు ఒక సంఘటన జరిగిందోయ్! ఆ ప్రమాదంలో నన్నొక వ్యక్తి కాపాడారు. అతనిని మనింటికి తీసుకొచ్చాను. అతనికే ఆ రెండవ కాఫీ.' చెప్పాడు మధు.

'అయితే, ఆయనను యింట్లో కూర్చోపెట్టి, మీరేమిటి ఇక్కడ కబుర్లు? నడవండి యింట్లోకి.

'మరి నా మామూలు!'

'ఛ...మరీ చిన్న పిల్లాడిలా ఏమిటా అల్లరి? మీ మాటలు ఇంట్లోకి వినపడతాయి. అతను వెళ్లాక ఇస్తాగా!' చిరుకోపంతో చూస్తూనే - ముద్దుగా విసుక్కుంటూ అతనికి ముద్దిచ్చిన వైనం అంతా యింట్లోకి విన్పిస్తూనే వుంది.

'అరె...మీరలా నిల్చునే వున్నారా? కూర్చోండి.' వస్తూనే రమేష్‌ను చూసి నొచ్చుకుంటూ అన్నాడు మధు.

ఇద్దరూ నవ్వుకుంటూ కూర్చున్నారు.

రెండు కప్పుల్లో కాఫీ తెచ్చింది ఉమ.

'ఇదిగో ఉమా! నేను చెప్పానే-ఆయన వీరే.'

'రమేష్‌గారూ! ఈమె నా మిసెస్ ఉమ.' అని పరిచయం చేశాడుమధు.

'నమస్తె!' అంటూ తలెత్తిన మధు—

'నమస్కారం!' అంటూ చూసిన ఉమ ఒకరి నొకరు చూసుకుంటూ నోట మాటరాని వారిలా వుండిపోయారు.

ముందు ఉమ తేరుకుంటూ—

With Best Compliments From :



SARADA BANIANS
SARADA KNITTING MILLS
TIRUPUR-638 602.
Phone : 23243, 26989

'మా వారి ప్రాణాలు కాపాడారు. చాలా థేంక్సండీ!' అంది యిద్దరికీ కాఫీలు అందిస్తూ.

'దట్సాల్ రైట్! సాటి మనిషిగా అది నా కనీస ధర్మం!' అన్నాడు.

'ఈ రోజుల్లో కావాలనే సాటి మనుషుల పతనానికి కారణమవుతున్నారెందరో మేకవన్నె పులులు. అలాంటి రాక్షసుల మధ్య మీలాంటి మంచివారుండబట్టే ఈ మాత్రమయినా న్యాయం జరుగుతుందేమో!'

'ఏదయినా మనం ఎదుటివ్యక్తిని అర్థం చేసుకోవడంలో వుంటుంది లెండి,' అన్నాడు.

'దానికి వయసే అక్కరలేదు. మనసు, సంస్కారం ఉండాలి కదండీ! ఏ సద్గుణవంతులకో తప్ప చాలా మందికి అన్నిటికంటే ఎక్కువగా కన్పించేవి డబ్బే సుమండీ! ఈ లోకంలో మనిషిని, మనసును, ప్రేమను, సర్వాన్నీ కొనగలిగేది డబ్బేనండీ! అందుకు అమ్ముడు పోతున్నారు చాలా మంది వ్యాపారరీత్యా. కాఫీ చల్లారిపోతుంది తీసుకోండి,' అంటూ తను లేచి వంటింట్లోకి నడిచింది ఉమ.

కాఫీ త్రాగి, మధుతో చెప్పి యిల్లు చేరుకున్నాడు

రమేష్. కాని ప్రతిక్షణం ఉమ జ్ఞాపకాలే తనను వెంటాడుతున్నాయి.

O O O

'ఉమా!' లోపలికి వస్తూనే పిలిచాడు రమేష్.

'ఊ....' అంది ఉమ.

'ఎక్కడ?'

'ఇక్కడ,' అందామె.

అటు చూశాడు రమేష్.

తెల్లని చీర, జాకెట్లో తల నిండా పూలతో, రతీదేవిలా అలంకరించుకొంది. రెండు చేతులనిండా పూలతో ఎదురొచ్చింది.

'ఏమిటిది?' నవ్వుతూ సంతోషంతో అన్నాడు రమేష్.

'ఈ రోజుతో పరీక్షలయి పోతాయి. రేపు మనం ఎవరి ఊరు వాళ్ళం వెళ్ళిపోతాం! అందుకని నా దేవుణ్ణి ఒక్కసారి నా మనసనే ఈ పూలతో అభిషేకించాలనీ...' అంటూనే అతని తలమీద నుండి పాదాలవరకూ పోసింది. ఉమ. 'ఉమా...! అంటు ఆనందంతో గొంతు పూడుకు పోగా ఆమెను హృదయానికి హత్తుకున్నాడు రమేష్.

అతన్ని లతలా అల్లుకొని వెక్కి వెక్కి ఏడ్చిందామె.

'రమేష్! నిన్ను చూడకుండా ఎలా వుండగలను?' అంది వెక్కిళ్ళమధ్య.

'ఉమా! నిన్ను విడిచి నేను మాత్రం వుండగలనా? తరచు ఉత్తరాలు రాస్తుంటానుగా-ప్లీజ్!...' అన్నాడు ఓదార్పుగా.

అలాగే అతని గుండెల కతుక్కుపోయిందామె.

'రమేష్! మన పెళ్ళికి మీ వాళ్ళు ఒప్పుకుంటారా?' హఠాత్తుగా అతని ముఖంలోకి చూస్తూ ప్రశ్నించింది.

'ఉమా! కులం, మతం, ధనం-ఇవేవీ ప్రేమకు అడ్డురావు. మన పరిచయం, మా ఊరు వెళ్ళగానే మా వాళ్ళతో చెప్పి మన పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తాను. నన్ను నమ్ము!' ఆమెను ప్రేమగా గుండెల కదుముకుంటు చెప్పాడతను.

'ఆ ఒక్క మాట చాలు రమేశ్! నీకోసం చంద్రునికై వేచి చూసే చకోరంలా నిరీక్షిస్తాను. నీ మీద నాకు పూర్తి విశ్వాసం వుంది.' అంటున్న ఉమ ముంగురులను సవరిస్తూ ఉండిపోయాడు రమేశ్.

O O O

కాలుస్తున్న సిగరెట్టు చురుక్కు మనిపించడంతో, చటుక్కున దాన్ని వదిలేసి లేచాడు రమేశ్. ఆర్థిక ఇబ్బందులు కావచ్చు. జీవితం నేర్పే అనుభవాలలో తన బ్రతుకుబాటకు ఏమిటవసరమో తెలుసుకున్నాడు. ఈ ప్రేమ తింటు తను జీవితం గడపలేదు. బ్రతకాలంటే డబ్బు కావాలి. ఉమ కట్నం తీసుకు రాదు. తనకు డబ్బు లేదు. ఆ తర్వాత అతను కావాలనే ఉమను కలుసుకోలేదు. అప్పుడే వస్తున్న సంబంధాల గురించి ఆలోచించాడు. అందులో అతనికి ఒక సంబంధం బాగా నచ్చింది. తల్లిదండ్రులకు ఒక్కతే అమ్మాయి. తండ్రి లక్షాధికారి. అమ్మాయి అందంగా లేకున్నా ఆమె తెచ్చే కట్నం చాలా చాలా నచ్చింది. ఇప్పుడతను ఒక పెద్ద బిజినెస్ మేగ్నెట్. ఎంతో పేరు. మరెంతో పలుకుబడితో చలామణి అవుతున్నాడు. ఇన్నేళ్ళ తర్వాత అనుకోకుండా ఉమ ఎదురయ్యింది. అప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడా ఆమెలో! సన్నగా, బంగారు తీగలా చలాకీగా వుండే ఆమె. ఇప్పుడు-కాస్త ఒళ్ళు వచ్చి, మరి కాస్త రంగుతో నిండుగా, గంభీరంగా వున్న ఆమె అందం ద్విగుణీకృతమయ్యిందే తప్ప, ఏమీ తగ్గలేదు.

ఇంతకూ ఉమ ఆ కుంటి భర్తతో సుఖపడుతుందా? తనకిప్పుడు ఉమ కావాలి. ఎలా? ఏదో గత్యంతరం లేక ఆ కుంటివాడిని చేసుకొని వుంటుంది.

ఇప్పుడు తను అడిగితే కాదనదు. ఎలా అడగాలి?

రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాడు రమేశ్.

O O O

'మధుగారున్నారండి?'

ఆ సమయంలో అతను యింట్లో వుండడనీ, అది అతని ఆఫీసు టైమనీ రమేశ్‌కు బాగా తెలుసు.

'లేరు.' ముక్తసరిగా చెప్పింది ఉమ.

డిగ్గున తలెత్తి అతని ముఖంలోకి చూసిందామె.

ఆ చూపులకు తట్టుకోలేక తల దించుకున్నాడతను. అతనితో మాట్లాడడంకూడా తనకు అసహ్యమే అన్నట్లు వంటింట్లోకి నడవబోతున్న ఆమెచేయి నందుకొన్నాడు.

అనుకోని ఈ సంఘటనకు విస్తుపోతూ — అతని చేతుల్లోంచి విడువడిన ఆమె చేయి విసురుగా రమేశ్ చెంపను తాకింది. కోపంతో ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది. ఆమె కొట్టినచెంపను తడుముకొంటు—

'ఉమా! నీకు నేనంటే ఏమీ లేదా? నువ్వు ఆ కుంటి వాడితో సుఖపడుతున్నావా?' అన్నాడు రమేశ్.

అతని మాటలకు నిలువెల్లా వణికిపోయిందామె. కోపంతో 'మిష్టర్ రమేశ్! అవునులే. పశువులాంటి నీకు ఎదుటి వ్యక్తిని గౌరవించాలనే జ్ఞానం నీకెలా వస్తుంది? అవకాశం వచ్చిందని వినియోగించుకోవడం నీనైజం.

'ఏమని అడిగావు? నేనంటే నీకేమీ లేదనా? చాలా వుంది.'

కొండంత అసహ్యం!

'నువ్వు గుర్తొస్తే జుగుప్స కలుగుతుంది.

ఒక ముష్టివాడు కన్పించినా దయ, కనికరం, కల్గుతాయేమో కానీ, నిన్నుచూస్తే కంపన, రోత–నీలాంటి దగా కోరులు కన్పిస్తే నరికి పోగులు పెట్టాలనిపిస్తుంది. నువ్వు అమ్ముడుపోయే డబ్బుతో ఈ సంఘంలో చలామణి అవగలవేమో కానీ నీ అంతరాత్మ ప్రతి నిముషం ఘోషిస్తూనే వుంటుంది–నిన్ను నువ్వు 'ద్రోహీ!-ద్రోహీ!' అని.

ఇకపోతే ఎవరు కుంటివాడు?

కుసంస్కార వంతుడివైన నువ్వు కుంటివాడివి.

మరో వ్యక్తిచేత వంచింపబడ్డ ఆడదాన్ని చేరదీసి ఆపిగా స్థానమిచ్చిన ఆ మహోన్నత వ్యక్తా కుంటివాడు??

మనసిచ్చిన దానిని వంచించి మరొకరికి అమ్ముడు పోయిన నువ్వు అవిటివాడివి.

నమ్ముకున్న వ్యక్తిని నిలువునా ముంచేసి, డబ్బు కనిపించేసరికి అదే పరమార్థమనుకున్న అవకాశవాదివి నువ్వు. కుత్సిత మనస్తత్వం గల నువ్వు సకల వ్యాధులుగల కుష్ఠువాడివి. పరాయి స్త్రీని పొందాలని చూసిన నువ్వు అంగవైకల్యుడివి.

నా భర్త పేరు స్మరించే అర్హత నీకు లేదు. 'ఐ సీ ప్లీజ్ గెట్ ఔట్!' అరిచింది ఉమ.

'అప్పుడే ఇంట్లోకి అడుగు పెడుతున్న భర్తను చూసి పరుగున వెళ్ళి అతని గుండెల్లో తల దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమె తలను ఆప్యాయంగా నిమురుతూ వుండిపోయాడు మధు.

అవమానభారంతో అడుగులు వేస్తూ బయటకు నడచాడు రమేశ్. *


'కథాంజలి' దీపావళి సంచికకు మా హృదయ పూర్వకమైన శుభాకాంక్షలు!



Estd. 1957 Phone : 2373

ఎల్లప్పుడూ...

మా ప్రసిద్ధిచెందిన

O జంకాళాలు O బెడ్‌షీట్లనే

ఉపయోగించండి.

ఆంధ్రప్రదేశంలో మా ప్రతినిధిగా చేరుటకు సమర్థులైనవారి నుండి

దరఖాస్తు కోరబడుచున్నాము.

: తయారించువారు :

**Rainbow Industrials**

P. B. No. 261 : : BHAVANI - 638 302.